www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 27 జనవరి 2024 5 కాకినాడ



జాతీయ జెండాకు అవమానం

సామర్లకోట రూరల్ : పట్టణంలో గణతంత్ర దినోత్సవంలో జాతీయ జెండాకు అవమానం కలిగింది. తహశీల్దార్ ఎస్ఎల్ఎన్.కుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా పతాకం తలక్రిందులుగా ఉండడంతో అంతా ముక్కున వేలేసుకున్నారు. దీంతో పతాకాన్ని క్రిందికి దింపి సరిచేసి మరోసారి ఆవిష్కరించారు. జాతీయ పతాకాన్ని సిద్ధం చేసిన సిబ్బందిపై తహశీల్దారు ఆగ్రహం వ్యక్తం చేశారు.


జాతీయ జెండాను సరి చేస్తున్న సిబ్బంది

ఘనంగా గణతంత్రం

75వ గణతంత్ర దినోత్సవాలను జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల కార్యాలయాల్లో అధికారులు, నాయకులు త్రివర్ణపతాకాలను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులకు కలెక్టర్, ఎస్పి పురస్కారాలు అందించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో ప్రజలందరి సమిష్టి భాగస్వామ్యంతో జిల్లాను అభివద్ధి, సంక్షేమ పథంలో నడిపిద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పిలుపు నిచ్చారు. స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా స్థాయి 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పోలీస్ కవాతును తిలకించారు. జాతీయ జెండాను ఎగురవేసి, వందనం చేశారు. ఎంపీ వంగా గీత, ఎంఎల్సి కర్రి పద్మశ్రీ, ఎస్పి సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ విశిష్య అతిథులుగా హాజరైయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో జిల్లా సాధించిన ప్రగతిని వివరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖలకు చెందిన 91 మంది అధికారులకు కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పి ఎస్.సతీష్ కుమార్ ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, డిఆర్డిఎ పీడీ కె శ్రీరమణి, కాకినాడ, పెద్దాపురం ఆర్డిఒలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు, డిఇఒ జి.నాగమణి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవాతు, శకటాల ప్రదర్శన

వేడుకల సందర్భంగా పోలీస్, ఎన్సిసి, రెడ్ క్రాస్ దళాలు నిర్వహించిన సాంప్రదాయ కవాతు ఆహూతులను అలరించింది. ఈ ప్రదర్శనలో ఉత్తమ కవాతుకు ప్రథమ బహుమతిని హోమ్గార్డ్ కంటెన్జెంట్, ద్వితీయ బహుమతిని 3 ఆంధ్రా ఎన్సిపి బాలికల బెటాలియన్ దక్కించుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 12 శకటాలు ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని ప్రదర్శించాయి. ఉత్తమ శకటాల ప్రదర్శనలో జిల్లా గహ నిర్మాణ సంస్థకు ప్రథమ బహుమతి, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ, మహిళా అభివద్ధి శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ద్వితీయ స్థానం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్లు సంయుక్తంగా తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నాయి. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి ఉద్యాన, మైక్రో ఇరిగేషన్, సెరీ కల్చర్ వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి ఎస్.సతీష్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎఎస్పి బి.సత్యనారాయణ, డిఎస్పిలు మురళీకృష్ణారెడ్డి, బోను అప్పారావు, చవ్వాకుల రామ కోటేశ్వరరావు కార్యాలయ ఎఒ శివరామ రాజు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, అధికారులు తొలుత జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ నాగ నరసింహారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన 45 మంది సిబ్బంది, సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ ప్రశంశా పత్రాలు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఇ పి.సత్య కుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఇ పి.వెంకటరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్,

శ్రీ రాజరాజేశ్వరి ఐటిఐ కళాశాలలో గణతంత్ర వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. నిమ్మకాయల వెంకటేశ్వర రావు, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, స్వర్ణ భారతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో

సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు జగన్నాథపురంలో క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎస్. సంతోష్ అధ్యక్షతన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, ఇస్మాయిల్, విక్టర్, రాజేష్, విజయ్కుమార్, దుర్గా ప్రసాద్, కొండబాబు, సత్య, భద్ర, రాము, సిద్ధు, శివశంకర్, గంగాధర్, సూరిబాబు, శ్రీనివాస్, వీరేంద్ర పాల్గొన్నారు.

ఐడియల్ కాలేజీలో..

స్థానిక ఐడియల్ ఆర్ట్స్ కాలేజీలో సెక్రటరీ, కరస్పాండెంట్ చిరంజీవినీ కుమారి ఆధ్వర్యంలో ఆలిండియా టాక్స్ ఫెడరేషన్ సభ్యుడు బి.సీతాపతిరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాలేజీ ప్రిన్సిపల్ టి.సత్యనారాయణ, సిహెచ్.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో..

ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు, కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి పాల్గొన్నారు. ప్రిన్సిపల్స్ కె.కరుణ, డి.బ్యూలా, డాక్టర్ పి.రమేష్, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, నాగ శ్రీకాంత్, క్యాంపస్ ఇన్ఛార్జి ఎన్.మూర్తి, తేజేశ్వరరావు, దివాకర్ రావు, వంశీ, సురేఖ పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో

కాకినాడ రూరల్ రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్మీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. అడబాల రత్నప్రసాద్, లక్ష్మణరావు, వరదరాజు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, గల్లా సుబ్బారావు, శిరీష, పార్థసారథి, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు. సర్పవరం జంక్షన్లో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన జాతీయ జెండాను ఆవిష్కరించారు. శ్రీదేవి రెడ్డి, రమాసుందరి, శిరీష, అడబాల రత్న ప్రసాద్, గల్లా సుబ్బారావు పాల్గొన్నారు. సర్పవరంలో అంతర్జాతీయ వాకర్స్ సంఘం అధ్యక్షురాలు ఎం.ప్రభావతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పంపన వెంకట్రావు, బండి శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.సత్తిబాబు, గాలి భాస్కరరావు, పి.రామచంద్రరావు, ముమ్మిడి సత్యనారాయణ, శివరామకష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విలియమ్స్ విద్యాసంస్థల్లో..

రాయుడుపాలెం విలియమ్స్ విద్యాసంస్థల మెయిన్ క్యాంపస్లో విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ స్టీఫెన్ ఆనంద్ అధ్యక్షతన వ్యవస్థాపకులు డాక్టర్ ఎంఎస్.విలియమ్స్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి స్టీఫెన్, మాస్టర్ షాన్ విలియమ్స్, బ్యాంకు మేనేజర్ సన్ రాజు, సూపరింటెండెంట్ జి శ్రీనివాస్, శారా నర్సింగ్ స్కూల్ అధ్యాపకులు వి.సునీత, విలియమ్స్ మరియు అన్నా విద్యా సంస్థలతో పాటు ఐటిఐ, శారా స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు భీమారావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ గోవిందు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ జెండా ఎగరవేశారు. వాసిరెడ్డి భాస్కర్ బాబు, సర్పంచ్ అరిజమ్మ పాల్గొన్నారు.

తాళ్లరేవు ప్రజా సంఘాల భవనంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు వల్లు రాజుబాబు, అత్తిలి బాబురావులతో కలిసి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. నాయకులు దుప్పి అదృష్టదీపుడు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, మందనక్క తణుకు రాజు, పూలే అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ప్రతినిధులు గుత్తుల మల్లేశ్వరరావు, పాలిక శ్రీనివాస్ పాల్గొన్నారు. తహశీల్దారు ఎస్.పోతురాజు, ఎంపిడిఒ ఎం.అనుపమ వారి కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపిపి రాయుడు సునీత గంగాధర్, ఎఎంసి చైర్మన్ శివన్నారాయణ, జెడ్పిటిసి సాగర్, ఉంగరాల వెంకటేశ్వరరావు మాట్లాడారు.

పెద్దాపురం ఆర్డిఒ కార్యాలయంలో ఆర్డిఒ జె.సీతారామారావు, కోర్టు ఆవరణలో 7వ జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి, డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి లతా కుమారి, మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ జె.సురేంద్ర, జాతీయ జెండాలు ఆవిష్కరించారు. నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ ఆర్.కమలం జెండా ఆవిష్కరించారు.

ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, నగర పంచాయతీ కార్యాలయంలో చైర్పర్సన్ అలమండ సత్యవతి, ఎర్రవరంలో జెడ్పిటిసి నీరుకొండ రామకుమారి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రేమ్ సాగర్, కమిషనర్ కె.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు సిబ్బంది ఉన్నారు.

కాజులూరు గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జెడ్పిటిసి వెంకట సుబ్బారావు, ఎంపిపి మాత భారతి మురళి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లి కష్ణమూర్తి పోతు వెంకటలక్ష్మి, గుంటూరు అప్పారావు, పోతురాజు ప్రసన్న మౌనిక విద్యార్థులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వెంకటనారాయణ, వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించారు. తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు ప్రసాద్ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో జాతీయ జెండా ఆవిష్కరించి గీతాలను ఆలపించారు. ఉప్పాడ, వాకతిప్ప తదితర పాఠశాలలో జాతీయ పతాకాన్ని నమస్కరించి స్వాతంత్ర సమరయోధులు చేసిన పోరాటాలను చిన్నారులకు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు

కిర్లంపూడి వేలంక పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ గండే కొండారావు, దోమల గంగాధర్, వేలంక సెక్రటరీ వీర్రాజు, సర్పంచ్ రాయుడు స్వామి, రమణ పాల్గొన్నారు. హెచ్ఎం మురళి కృష్ణ పాల్గొన్నారు.

గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ బిఎస్కె.రామన్ జెండా ఆవిష్కరించారు. ఎంపిపి చలగళ్ల దొరబాబు, ఎంపిటిసిలు గ్రామ సర్పంచులు పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు చిన్నారావు, పోలీస్ స్టేషన్ వద్ద ఎఎస్ఐ చంద్రశేఖర్, మురారి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కుక్కల ఆనంద్, ఉప సర్పంచ్ జాతి వసంత్ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు.

ఆదిత్య విద్యా ప్రాంగణంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, వివిధ కళాశాలల్లో ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ డోలా సంజయ్ ఎస్, డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్ కుమార్, ఎస్.టి.వి.ఎస్ కుమార్, డాక్టర్ సంజయ్ కుమార్, విలాస్ చౌహాన్, సత్యనారాయణ, ఉపాధ్యాయ, సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు, హాస్టల్ వార్డెన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మిఠాయిలు పంచారు.

జగ్గంపేట రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, ఎంపిడిఒ వసంత కుమార్ జెండాను ఎగురవేశారు. పోలీస్ స్టేషన్లో సిఐ లక్ష్మణరావు, ఎస్ఐ నాగార్జున రాజు జెండా ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. పంచాయతి కార్యాలయంలో ఉప సర్పంచ్ బండారు రాజా జెండాను ఎగురవేశారు. స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో కరస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ జెండాను ఆవిష్కరించారు.

సామర్లకోట రూరల్ తహశీల్దారు ఎస్ఎల్ఎన్.కుమారి, ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఎంపిపి బొబ్బరాల సత్తిబాబు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి పాల్గొన్నారు. తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు కుమారి, ప్రభుత్వాసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్, పోలీసు స్టేషన్లో డిఎస్పి లతా కుమారి, సి సురేష్ అన్ని పాఠశాలల్లో హెచ్ఎంలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్మోజెస్, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్పర్సన్ ఆవాల రాజేశ్వరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పిఠాపురం : పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక కోర్టుల ఆవరణలో 12వ అదనపు జిల్లా జడ్జి వాసంతి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎంఎల్.సాయి సుభాష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజారావు, కెఎస్ఆర్.భాస్కర్ పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.త్రినాధరావు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కష్ణవేణి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ చిన్నారావు, అగ్రికల్చర్ కార్యాలయంలో ఎడిఎ స్వాతి, పోలీస్ కార్యాలయంలో సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు మురళీ మోహన్, గుణ శేఖర్, రాము చౌహన్ పాల్గొన్నారు.

కరప తహశీల్దారు పొన్నమండ శ్రీనివాసరావు, ఎంపిడిఒ కె.అప్పారావు, ఎంపిపి పెంకి శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్పిటిసి వై.సుబ్బారావు, జెడ్పి హైస్కూల్లో జెడ్పిటిసి సుబ్బారావు జెండా ఆవిష్కరించారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు పబ్బినీడి కనకరాజు, చింతపల్లి అర్జునుడును ఘనంగా సత్కరించారు. స్థలదాత పబ్బినీడి పాపారావు, ఎస్ఎంసి చైర్మన్ పబ్బినీడి వీరబాబు, సర్పంచ్ శ్రీనివాస రావు, ఎంపిటిసి వై.వీరవేణి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సంజయ్ పాల్గొన్నారు.


కాకినాడలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా


కాకినాడ ఐడియల్ కాలేజీలో..


కరపలో మాజీ సైనికులకు సన్మానం



కాకినాడ రూరల్ విలియమ్స్ విద్యా సంస్థల్లో..


పెద్దాపురంలో..


కాజులూరులో..


జగ్గంపేట రూరల్లో..

కార్టూ'నిజం'



హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

42 రోజులు జరిగిన అంగన్వాడీల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు తక్షణం ఆదేశాలు జారీ చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. డిసెంబరు 12న మొదలైన అంగన్వాడీల సమ్మె జనవరి 22 అర్ధరాత్రితో ముగిసిందని, దానర్థం పోరాటం ముగిసినట్టు కాదని తాత్కాలిక విరామమేనని తెలిపారు. సమ్మె విజయవంతానికి సహకరించిన ప్రజా సంఘాలు, కార్మిక, మహిళా సంఘాలకు, రాజకీయ పార్టీలకు, అంగన్వాడీల లబ్ధిదారులకు, రాష్ట్ర ప్రజానీకానికి, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక కచేరిపేట సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.బేబిరాణి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల పద్మ, ఇ.చంద్రావతితో కలిసి మాట్లాడారు. జగన్ ప్రభుత్వం అధికారికంగా ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారుల సంతకాలతో రాతపూర్వకంగా ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. సమ్మె కాలం వేతనాలు చెల్లించేలాగా, సమ్మెలో నాయకులపై, అంగన్వాడీలపై పెట్టిన కేసులు ఎత్తివేసేలా, తొలగించిన వారందరినీ బేషరతుగా విధుల్లోకి తీసుకునేలా అంగీకరించిన తరువాతే విరమించినట్లు మీడియాకు తెలిపారు. యూనియన్ ఇచ్చిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్ 11లో 9 డిమాండ్లపై నిర్దిష్టంగా ఆదేశాలు ఇస్తామని ప్రభుత్వం అంగీకరించిందన్నారు. గ్రాడ్యుటీ కేంద్రానికి నివేదించి, జులైలో యూనియన్ నాయకులతో చర్చించి ఉభయులు అంగీకారం మేరకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని చర్చల వివరాలను తెలిపారు. ఈ 42 రోజుల సమ్మె కాలంలో అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం షోకాజ్ నోటీసులు, టెర్మినేషన్ లేటర్లు, ఎస్మా ప్రయోగించినా, అబద్ధపు ప్రచారాలతో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేసినా, చట్టబద్ధమైన సమ్మెకు రాజకీయరంగు పూలమాలని ప్రయత్నించినా మొక్కవోని దీక్షతో అంగన్వాడీలు ఐక్యంగా పోరాడి జగన్ ప్రభుత్వ మెడలు వంచి విజయం సాధించారన్నారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు బాలం లక్ష్మీ, జిల్లా ఆఫీస్ బేరర్స్ రాజేశ్వరి, నాగమణి, ఎస్తేరు రాణి, బుల్లెమ్మ, మేరీ సమాధానం, లక్ష్మీ, వీరవేణి, చామంతి, నీరజ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నేత బేబీరాణి తదితరులు

రోడ్లు వేస్తేనే.. ఓట్లు వేస్తాం..

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాకుండానే ఎంఎల్ఎ సహా పలువురు ప్రజాప్రతినిధులకు నిరసన సెగ తగిలింది. తమ గ్రామానికి రోడ్డు వేస్తేనే ఓట్లు వేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీసిన సంఘటన శాంతమూల గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల సందర్భంగా పటవల పంచాయితీ శాంతమూల వచ్చిన ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ వద్ద మహిళలు నిరసన తెలిపారు. మహిళలు మాట్లాడుతూ తమ గ్రామానికి రోడ్లు వేస్తేనే ఓట్లు వేస్తామని అన్నారు. దీనిపై ఎంఎల్ఎ సతీష్ కుమార్ మాట్లాడుతూ పటవల, శాంతమూల రహదారికి నిధులు మంజూరు అయ్యాయని ఎన్నికల కోడ్ సమీపించనున్న కారణంగా రహదారి పనులు ప్రారంభం కాకపోవచ్చని, మే నెలలో తప్పక రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పార. ఎన్నికలకు ముందే రోడ్లు వేయాలని మహిళలు తేల్చి చెప్పారు. ఎంఎల్ఎ సతీష్ కుమార్ మాట్లాడుతూ పరిస్థితి అర్థం చేసుకోవాలని ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించామని సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు. దీంతో స్థానిక మహిళలు శాంతించారు.


ఎంఎల్ఎ పొన్నాడ సతీష్తో మాట్లాడుతున్న మహిళలు

నేరాలు ఘోరాలు

రూ.1.27 లక్షలు కాజేసిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ఇబ్బందిలో ఉన్న ఒక మహిళకు న్యాయం చేయిస్తానని నమ్మబలికి ఆమె నుండి రూ.1.27 లక్షలు సొమ్ము కాజేసిన కేసులో సామర్లకోటకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ సురేష్ తెలిపారు. పట్టణానికి చెందిన కమ్మిల శ్రీనివాసు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఒక మహిళతో అధికారుల వద్ద తనకు చాలా పలుకుబడి ఉందని, ఆ సమస్యను పరిష్కారం చేస్తానని నమ్మించాడు. తొలుత మహిళ వద్దనుంచి కొంత సొమ్మును తీసుకొని ఆమె నిలదీయగా అతడు ఆమెను మరలా భయపెట్టి మరికొంత సొమ్ము కాజేసినట్లు చెప్పారు. ఆ మహిళ వద్ద నుండి మొత్తం రూ.1,27,000 నిందితుడు కాజేసినట్లు బాధితురాలు చేసిన ఫిర్యాదుపై సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను కాకినాడ న్యాయస్థానం ముందు హాజరు పరిచామన్నారు. అతనికి కోర్టు రిమాండ్ విధించినట్లు సిఐ సురేష్ వివరించారు.

సారా తయారీ కేంద్రంపై దాడులు

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

పట్టణంలో సారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు జరిపినట్లు ఎస్ఐబి సిఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలో పిఠాపురం మండలం జల్లూరుకు చెందిన గంజా గంగాధర్ అరెస్ట్ చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సారా తయారీకి సిద్ధం చేసిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

గృహోపకరణాల అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రంగవల్లి నగర్ కాలనీలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు శనివారం గృహోపకరణాలు అందజేశారు. అఖిల గాండ్ల తెలకుల సంఘం ఆధ్వర్యంలో బాధితులకు రెండు బీరువాలు, రెండు మంచాలు, నిత్యావసర సరుకులు, రూ.28 వేల నగదు వారికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాండ్ల తెల్లకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరు నాని, నరవ అనంతం, అడ్డా వెంకటరాజు, గొట్టిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు

150 మంది వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని పులిమేరులో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆశ్రమ యోగ గురువు మసిముక్కల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మిల్లెట్స్ టిఫిన్‌తో పాటు ఆయుర్వేద వంటకాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. తుమ్మల అచ్యుతరామయ్య, మల్లిక్, బుల్లయ్య, నాని, సుందర రెడ్డి రాజు, తోట శేషారావు తదితరులు పాల్గొన్నారు.

శాంతివర్ధన సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పెద్దాపురం

వికలాంగులకు, వృద్ధులకు శాంతి వర్ధన అందచేస్తున్న సేవలు ప్రశంసనీయమని వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాటంశెట్టి నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన పులిమేరులోని శాంతివర్ధన వికలాంగుల పాఠశాలను సందర్శించారు. వారు అందజేస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వికలాంగుల పాఠశాలను నిర్వహించడంతోపాటు గత రెండేళ్లుగా వృద్ధులకు కూడా వివిధ రకాల సేవలందిస్తున్న పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబును, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన తిరుపతి గ్రామ యువతకు కబడ్డీ క్రీడా సామాగ్రి, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తుమ్మల అచ్యుతరామయ్య, అప్పలరాజు, శివ, శ్రీనివాస్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



సిఎం జగన్‌తో ఎలిశెట్టి నరేష్ కుటుంబ సభ్యులు

సిఎంను కలిసిన ఎలిశెట్టి కుటుంబం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని శుక్రవారం తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సీనియర్ వైసిపి నాయకుడు ఎలిసెట్టి నరేష్, ఆయన భార్య సామర్లకోట జెడ్‌పిటిసి అమృత ఇద్దరు పిల్లలతో కలిశారు. ఈ సందర్భంగా తనపై, తన తండ్రి భీమన్న దొరపై గతంలో జరిగిన హత్యా ప్రయత్నాలు, నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను సిఎం జగన్‌కు వివరించినట్లు నరేష్ విలేకరులకు చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ తమను ఆప్యాయంగా పలకరించి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారని చెప్పారు.

మహిళలకు సిఎం మొండి చేయి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని నమ్మించి సిఎం వైఎస్.జగన్ మొండి చేయి చూపించారని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. మండలంలోని ఇర్రిపాకలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా అక్కాచెల్లెళ్లకు తనకు అధికారం ఇస్తే మద్యపానం నిషేధం చేస్తానని, 2024 ఎన్నికల్లో మద్య నిషేధంతోనే ఓట్లు అడుగుతానని చెప్పారని గుర్తు చేశారు. రాబోయే 26 ఏళ్లకు కూడా అప్పు తెచ్చి రాష్ట్రంలో తాగుబోతుల సంఖ్య రోజురోజుకు పెంచారన్నారు. టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు అక్కాచెల్లెళ్లకు పావలా వడ్డీకి రుణాలు ఇప్పించి వారి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఆసరా కల్పించిన తమ నాయకుడు చంద్రబాబు అన్నారు. మహిళల పథకాలను జగన్ నిర్వీర్యం చేశాడని చెప్పారు.

మంట పుట్టించిన మండపేట.!

సిట్టింగ్ ఎంఎల్ఎకు సీటు ప్రకటించిన చంద్రబాబు
రాజోలు, రాజానగరంలో పోటీ చేస్తున్నట్లు పవన్‌క్లారిటీ
పొత్తు ధర్మంపై రాజకీయ వర్గాల్లో చర్చ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

'నాకున్న ఒత్తిళ్లు నాకున్నాయి. వాళ్లు రెండు సీట్లు ప్రకటించారు కాబట్టి మేం రెండు సీట్లు ప్రకటిస్తున్నాం. రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ చేస్తోంది' అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శుక్రవారం రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ప్రకటించారు. దీనికి కారణం ఇటీవల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మండపేటలో 'రా కదలి రా' సభలో సిట్టింగ్ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును మూడోసారి గెలిపించాలి అంటూ చంద్రబాబు ప్రకటించారు. దీంతో పాటు అరకు సీటును కూడా డిక్లేర్ చేశారు. దీంతో మిత్ర పక్షాల మధ్య మండపేట మంట పుట్టించినట్లు అయింది. గత ఎన్నికల్లో జనసేన తరుపున ఇక్కడ వేగుళ్ల లీలా కృష్ణ పోటీ చేయగా ఎక్కువ ఓట్లనే సాధించారు. ఈసారి కూడా ఆయనే టికెట్ ఆశిస్తున్నారు. ఈలోగా టిడిపి సిట్టింగ్ సీటు కాబట్టి చంద్రబాబు బహిరంగ సభలో ప్రకటించారు. దీంతో జనసేన శ్రేణులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా పవన్ కళ్యాణ్ తన పార్టీ శ్రేణులకు క్షమాపణ కూడా చెప్పారు. దీంతో పాటుగా ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల్లో జనసేన గెలుపొందిన ఏకైక సీటు రాజోలు మాత్రమే. ఇక్కడ జనసేన సిట్టింగ్ సీటును ప్రకటించడంలో పెద్దగా ఆశ్చర్యం లేదు కాని రాజానగరంలో మాత్రం ఆసక్తిగా మారింది. అక్కడ గడచిన మూడు ఎన్నికల్లో రెండుసార్లు టిడిపి గెలిచింది. 2019లో మాత్రం ఓడిపోయింది. ఆ సీటును బొడ్డు వెంకటరమణ చౌదరి ఆశిస్తున్నారు. దానికి తగ్గట్టుగానే గత ఏడాదికాలంగా క్షేత్రస్థాయిలో గట్టిగా పని చేస్తున్నారు. ఇప్పుడు ఆ సీటులో బొడ్డును కాదని జనసేన పోటీ చేస్తుందని ప్రకటించడంతో టిడిపి శ్రేణులు ఆగ్రహంతో ఉన్నారు. అధినేతలు మాట్లాడుకొని ఉమ్మడిగా ముందుకు వెళ్లాల్సింది పోయి ఇలా బహిరంగంగా సీట్లను ప్రకటించడం వల్ల కింది స్థాయిలో ఇరు పార్టీల్లో సందిగ్ధత ఏర్పడింది. ఇది పొత్తుపై ప్రభావం పడేలా కనిపిస్తుంది. టిడిపి, జనసేన పొత్తుతో ముందుకు వెళితే



ముఖ్యంగా గోదావరి జిల్లాలు అందులో తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కువగా ఈ ప్రభావం ఉంటుందని తొలి నుంచీ అంచనాలు ఉన్నాయి. దానికి తగ్గట్టుగానే ఇప్పుడు మండపేట మంట పుట్టించడం దానికి కొనసాగింపుగా రాజోలు, రాజానగరం ఈ మంట రాజేయడంతో వీళ్ల పొత్తులో ఇంకా ఎన్ని మలుపులు ఉంటాయో అనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రెండు పార్టీల నాయకుల్లో సందిగ్ధత మరింత పెరిగింది. క్షేత్రస్థాయిలో శ్రేణుల్లో మరింత గందరగోళంలోకి నెడుతున్నాయి. ఈ పొత్తులు ఏ మేరకు సాగుతాయనే దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

మూడు జిల్లాల పరిధిలో రాజోలుతో పాటు అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ రూరల్, పిఠాపురం, జగ్గంపేట, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పెద్దాపురం వంటి అసెంబ్లీ స్థానాలను జనసేన పార్టీ ముందు నుంచీ ఆశిస్తోంది. కానీ టిడిపికి కూడా వీటిలో అనేక స్థానాల్లో బలమైన నేతలు ఉన్నారు. ప్రధానంగా రాజమండ్రి రూరల్, పెద్దాపురం వంటి ప్రాంతాల్లో సిట్టింగ్ ఎంఎల్‌ఎలు ఉన్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎంఎలఎలకు ఆయా స్థానాలను కేటాయిస్తున్నట్లు టిడిపి అధినేత ప్రకటించారు. మెట్ట ప్రాంతంలో బలమైన నాయకుడు, టిడిపి సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ ఉండగా జగ్గంపేట సీటుని జనసేనకు కేటాయించే అవకాశం లేదు. మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ కచ్చితంగా పిఠాపురం నుంచే పోటీ చేస్తానని ఇప్పటికే స్పష్టం చేసారు. కానీ బలమైన కాపు సామాజికవర్గం ఉన్న నియోజకవర్గం కాబట్టి జనసేన ఈ టిక్కెట్ ఆశిస్తోంది. అందుకు తగ్గట్టుగానే పవన్‌కు అత్యంత సన్నిహితుడు అయిన తంగేళ్ల ఉదయ శ్రీనివాస్‌ను ఆరు నెలల క్రితం ఇక్కడ ఇన్చార్జిగా నియమించారు. ఆయన వివిధ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఒక వేళ పొత్తులో జనసేనకు కేటాయిస్తే స్వాతంత్ర్య అభ్యర్థిగా పోటీలో ఉంటానని వర్మ తన అనుచరులతో ఇప్పటికే మాట్లాడుకుని ముందుకు వెళుతున్నారు. పోటీపై కేడర్‌కు స్పష్టతనిచ్చారు రెండు రోజుల క్రితం పిఠాపురం మండలం చిత్రాడలో జరిగిన జయహో బిసి కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు పాల్గొని పొరుగు ఊరి వారిని తరిమికొట్టి స్థానికుడైన వర్మకు ఓటేయాలని పిలుపునిచ్చారు. దీంతో పిఠాపురం నియోజకవర్గంలో జనసేన, టిడిపి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గు మనేలా రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి సీట్లు కొన్నింటిపై ఇరు పార్టీల మధ్య సఖ్యత కుదిరేలా కనిపించడం లేదు. ఒకరికొకరు సహకరించుకునే అవకాశం తక్కువని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు

గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. కాకినాడలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ కృతికా శుక్లా పురస్కారాలు అందించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

సామర్లకోట రూరల్ మెప్మా సిఎంఎం సుజాత, 11వ సచివాలయ ఎఎన్ఎం ఎస్.దేవకీకృప ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల చేతుల మీదుగా వారు పురస్కారం, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వీరిని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మెప్మా సిబ్బంది, కౌన్సిలర్ సెపేని సురేష్, సచివాలయం సిబ్బంది అభినందించారు. **తాళ్లరేవు** సిహెచ్‌సికి చెందిన ఆరోగ్య మిత్ర ఖాజా మొహిద్దీన్ బెస్ట్ ఆరోగ్యమిత్రగా ప్రశంస పత్రం అందుకున్నారు. చొల్లంగి అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.వీర వెంకటరమణ అవార్డు, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. **కరప** ఎంఇఒ కె.బుల్లికృష్ణవేణి, ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు పురస్కారాలు అందుకున్నారు. **ఏలేశ్వరం** ఎస్ఐ సతీష్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జెడి ఆనంద్‌కుమార్ పురస్కారాలు అందుకున్నారు. **పిఠాపురం** తహశీల్దారు కార్యాలయంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు పురస్కారం అందుకున్నారు. **పెద్దాపురం** మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగం వర్కర్ శివకోటి అప్పారావుకు రిపబ్లిక్ డే పురస్కారం లభించింది. **గండేపల్లి** ఆరోగ్యశాఖలో డిఇఒ లక్ష్మీ సుందరి పురస్కారం అందుకున్నారు. **రౌతులపూడి** డిప్యూటీ తహశీల్దార్ పివివి.సత్యనారాయణ పురస్కారాన్ని అందుకున్నారు.



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న కరప ఎంఇఒ బుల్లికృష్ణవేణి



అవార్డులు అందుకుంటున్న వారు వరుసగా సుజాత, దేవకీ కృప (సామర్లకోట, ఖాజా మొహిద్దీన్, వెంకటరమణ (తాళ్లరేవు)



అవార్డులు అందుకుంటున్న వారు సలాది శ్రీనివాసరావు (కరప) ఎస్ఐ సతీష్, ఆనంద్‌కుమార్ (ఏలేశ్వరం) శివకోటి అప్పారావు (పెద్దాపురం), లక్ష్మీ సుందరి (గండేపల్లి) సత్యనారాయణ (రౌతులపూడి)

యానాం వార్తలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

ఘనంగా గణతంత్ర దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలోని శుక్రవారం ఉదయం గణతంత్ర దినోత్సవ వేడుకలు' ఘనంగా నిర్వహించారు. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. అనంతరం పరిపాలనాధికారి మునిస్వామి, ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్, ఎస్‌పి రఘునాయగం త్రివర్ణ రంగుల బెలూన్స్, శాంతికపోతాలను ఎగురవేశారు. యానాం పోలీసుశాఖ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ షణ్ముగం పాల్గొన్నారు.

జిజిహెచ్‌ఒ సిబ్బంది చర్చలు సఫలం

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వాసుపత్రి వద్ద జనవరి మూడో తారీకు నుంచి శుక్రవారం వరకు సుమారు 23 రోజులపాటు ఔట్సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పరిష్కారం కోసం పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు స్థానిక అధికారులతో చర్చలు జరిపారు. పరిపాలనాధికారి మునిస్వామి, వైద్య శాఖ అధికారి డిడి రవిశంకర్ పుదుచ్చేరి ఉన్నత స్థాయి అధికారులతో జరిపిన చర్చలు ఫలితంగా వచ్చే నెల 19వ తారీకు లోపు పెండింగ్‌లో ఉన్న 42 నెల జీతాలు ఇచ్చేందుకు, ఉద్యోగ భద్రత, పదోన్నతి తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు యానాం జిజిహెచ్ ఔట్సోర్సింగ్ సిబ్బంది తెలిపారు. పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలతో నైనా తమకు వేతనాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లేకుంటే మళ్లీ దీక్షకు దిగుతామని చెప్పారు. చర్చలు ఫలించడంతో శుక్రవారం మధ్యాహ్నం నుండి విధులకు హాజరవుతున్నామని తెలిపారు. 23 రోజులపాటు దీక్షలో సంఘీభావం తెలిపిన ప్రజా ప్రతినిధులకు, ఇతర పెద్దలకు, వివిధ పార్టీ ల నాయకులకు, కతజ్ఞతలు తెలిపారు.

రంజీట్రోఫీ క్రికెట్‌కు నాగూర్ బాబు ఎంపిక

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో ఈ నెల 26 నుంచి జరగనున్న రంజీట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌కు యానాం సావిత్రినగర్‌కు చెందిన కాలాడి నాగూర్ బాబు ఎంపికైనట్లు రీజియన్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి పి.సుమన్ బాబు తెలిపారు. ఈ రంజీట్రోఫీలో పుదుచ్చేరి జట్టు మధ్యప్రదేశ్ జట్టుతో ఆడనుందని తెలిపారు. పుదుచ్చేరి జట్టు లోకి నాగూర్ బాబు ఎంపిక కావడం పట్ల వై.జె.సత్యం, పి.రమేష్ నాయుడు, కె.సుబ్బారావు, జె.చిట్టి, కె.ప్రసాద్, కె.సత్యనారాయణ, పి.ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

త్వరలో ఒఎన్‌జిసి నష్టపరిహారం అందజేత

ప్రజాశక్తి - యానాం

యానాం మత్స్యకారులకు రావాల్సిన ఒఎన్‌జిసి వేట నష్ట పరిహారానికి సంబంధించిన నిధులు త్వరలో మత్స్యకారుల ఖాతాలో జమ అవుతాయని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందరి సహకారంతో ఈ సమస్య పరిష్కారమైందన్నారు. మత్స్యకారులు తమ ఖాతాలో పడిన డబ్బులను ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వనవసరం లేదని తెలిపారు. ఎవరైనా మిమ్మల్ని డబ్బులు ఇవ్వమని అడిగితే పోలీసులకు గాని, తనకు గాని ఫిర్యాదు చేయాలని సూచించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎంఎల్ఎ

జామియా మసీదు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - యానాం

స్థానిక మసీదు వీధిలో ఉన్న జామియా మసీద్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎస్‌కె.జిలాని, వైస్ ప్రెసిడెంట్గా మహమ్మద్ కరీమ్, సెక్రటరీగా రిజ్వాన్, జాయింట్ సెక్రటరీగా మహమ్మద్ గౌస్ మొహిద్దీన్, ట్రెజరర్‌గా జిలానీ ఎన్నికయ్యారు. గత కార్యవర్గం కాలం పూర్తవడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ముస్లిం పెద్దలు, పలువురు రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శేరు నూకరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రమణరాజుకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ధర్నా చౌక్‌ను కలెక్టరేట్‌కు మార్చాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లా కేంద్రంలోని ఉప్పుటేరు వద్ద ఉన్న ధర్నా చౌక్‌ను కలెక్టరేట్ వద్దకు మార్చాలని ప్రముఖ సామాజిక వేత్త దూసర్ల పూడి రమణరాజు జాతీయ జెండాతో శుక్రవారం నిరాహారదీక్ష చేపట్టారు. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించే వరకు తన దీక్ష కొనసాగుతుందని పేర్కొన్నారు. రాత్రి వేళలో ఇక్కడ దీక్ష కొనసాగించడం అభద్రతకు పరాకాష్టగా ఉన్న విషయం ఇంటెలిజెన్స్ వర్గాలు ముఖ్యమంత్రికి తెలియజేయాలన్నారు. రక్షణ కరువైన ధర్నాచౌక్ వద్ద దీక్ష చేయడం ఎంత ప్రమాదకరమో తెలిసిన సామాన్యుడు సామాజిక వెతలపై ముందుకు రావడానికి సాహసం చేయలేక పోతున్నారన్నారు. కలెక్టరేట్ వద్దకు వెళితే కేసులు దాఖలు చేసి కోర్టులకు ఈడుస్తున్న దుస్థితి ఎదుర్కోవాల్సిన అగత్యం తీసుకువచ్చారన్నారు.

రమణరాజు చేపట్టిన నిరాహార దీక్షపై అధికారులు తక్షణం స్పందించాలనీ సిపిఎం కాకినాడ రూరల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. నిరాహార దీక్ష చేపట్టిన రమణరాజుకు సంఘీభావం తెలిపింది. పార్టీ మండల కమిటీ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ వివిధ ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు ఉద్యమం చేపట్టినప్పుడు కలెక్టరేట్ వద్దకు ధర్నా చౌక్ మార్పు చేస్తామని జిల్లా అధికారులు ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు చేసి నిలబెట్టుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. ధర్నా చౌక్ ప్రాంతంలో రమణరాజు దీక్ష కొనసాగడం ఆయనకి ముప్పు వుందని, గతంలో ఆయనపై పలుసార్లు దాడులు జరిగిన విషయం పరిగణలోకి తీసుకొని అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, చింతపల్లి అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి -కరప

మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. యండమూరు గ్రామంలో నూతనంగా రూ.66 లక్షల 80 వేతో నిర్మించిన వాటర్ టాంక్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కోసం వేసిన పైపులైన్, రూ.15 లక్షలతో అరుంధతి పేటలో నిర్మించిన ఎస్‌సి కమ్యూనిటీ హాల్, వడ్డిపాలెంలో రూ.15 లక్షలతో నిర్మించిన ఎస్‌సి కమ్యూనిటీ హాల్, రూ.2.5 లక్షలతో నిర్మించిన అంబేద్కర్ విశ్రాంతి మందిరాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి పెంకే శ్రీలక్ష్మీ సత్తిబాబు, యండమూరి సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిడిపి 'జయహో బిసి'

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

అమీనాబాద్ గ్రామంలో శుక్రవారం టిడిపి జయహో బిసి సభను పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, పిల్లి అనంతలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన, టిడిపి కుటమితో వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని సిఎం చేయడమే ధ్యేయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి అధికారం చేపట్టిన తర్వాత బిసిలకు చేసిందేమీ లేదని తెలిపారు. 56 బిసి కార్పొరేషన్ల చైర్మన్లుగా నియమించి వారికి ఉండటానికి వసతే లేకుండా చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి సొంత సోదరినుఏ మోసం చేశారన్నారు. అనిశెట్టి సత్యానంద రెడ్డి, సూరాడ రాజు, చోడిపల్లి ప్రసాదు, వేమగిరి రాంబాబు, కొర్ని రమణ, రాచపల్లి సనపయ్య, మల్లిబాబు, రావు అక్షయ్, పిల్లి చిన్న పాల్గొన్నారు.



పేదలకు వస్త్రాలు అందిస్తున్న డాక్టర చిన్నయ్య దొర

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

భారత్ మాతా సేవా పరిషత్ ఆధ్వర్యంలో వందమంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. సామర్లకోట చక్రవర్తి అపార్ట్‌మెంటు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తొలుత భారత్ మాతా సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోరకపూడి చిన్నయ్య దొర ఒఫీర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పెద్దాపురం పోలీస్ స్టేషన్ వద్దగల భారత్ మాతా విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు జరిపారు. అనంతరం 50 మంది మహిళలకు చీరలు, 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కంచాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్‌టిఆర్ కాలనీలోని అప్పర్ ప్రైమరీ స్కూలు, పాత పెద్దాపురంలోని అంబేద్కర్ మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న 350 మంది విద్యార్థులకు శుక్రవారం మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ద్వారా స్టీల్ కంచాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకుడు రాజేష్ కుమార్ దేవత మాట్లాడుతూ దాతల సహకారంతో రూ.20 వేల వ్యయంతో వీటిని అందజేశామన్నారు.

సమాజ సేవలో భాగస్వామ్యం అవ్వాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట శశి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభయ క్షేత్రంలో వృద్ధులు, చిన్నారులకు హిజ్ మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ సురేంద్ర, నీలు దంపతులు శుక్రవారం భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభయ క్షేత్రంలో పాస్టర్ సురేంద్ర, నీలు దంపతుల పెళ్లిరోజు వేడుకను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ అభయ క్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలను వీరి మధ్య జరుపుకుని వారి జీవితాల్లో సంతోషాలు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో శశి చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నరసింహారావు పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్ స్టేషన్ ప్రారంభం

పెద్దాపురం : పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర మాట్లాడుతూ యూనిసెఫ్ సౌజన్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. చైర్‌పర్సన్ తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత ద్వారా రోగాలు సోకకుండా నిరోధించవచ్చున్నారు.